

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, పెదబాబు తదితరులు

సొంత గూటికి మేయర్ దంపతులు

మంత్రి లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన నూర్జహాన్, పెదబాబు

- సైకిలెక్కేందుకు కార్పొరేటర్లంతా తహతహ
- వైసీపీకి వరుస షాక్‌లు..

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 27 : ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకుని సొంత గూటికి చేరారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలో వీరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో వీరితోపాటు ఇడా మాజీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు మంచెం మైబాబు, కార్పొరేటర్ బొద్దాని అఖిల టీడీపీలో చేరారు. లోకేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏలూరు నగరాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని వారికి సూచించారు.

వైసీపీ నాయకులంతా టీడీపీ బాట

మేయర్ దంపతులు టీడీపీలో చేరడంతో వైసీపీకి మరో షాక్ తగిలింది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆళ్ళ నాని వైసీపీకి రాజీనామా చేయడంతో నగరంలో కుదేలైంది. తాజాగా మేయర్, కార్పొరేటర్ల వంతు వచ్చింది. రేపో మాపో మరో 30 మందికిపైగా కార్పొరేటర్లు టీడీపీ తీర్థం తీసుకోనున్నారు. 50 డివిజన్లు ఉన్న నగరపాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో 47 స్థానాలను వైసీపీ, మూడు స్థానాలను టీడీపీ దక్కించుకుంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇద్దరు కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చారు. మిగిలిన 45 మందిలో మేయర్ దంపతులు కాకుండా 30 మందికి పైగా టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు కార్పొరేటర్లు జనసేన వైపు వెళ్లే అవకాశాలున్నాయి. 2014లో మొదటిసారిగా టీడీపీ తరపున మేయర్‌గా ఎన్నికైన షేక్ నూర్జహాన్ 2019 ఎన్నికల ముందు వరకు ఐదేళ్లు మేయర్‌గా వ్యవహరించారు. 2019 నుంచి 2021 వరకు కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. ప్రత్యేకాధికారి పాలన సాగింది. అనంతరం వైసీపీ నాయకుల ఒత్తిడి వల్ల అనివార్య పరిస్థితుల్లో మేయర్ దంపతులు వైసీపీకిలోకి వెళ్ళాల్సి వచ్చింది. ఆపై 2021లో ఎన్నికలు జరగ్గా మరల మేయర్‌గా రెండోసారి నూర్జహాన్ ఎన్నికయ్యారు.

నగర అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే చంటి

కూటమి ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి మరింత చురుగ్గా తీసుకెళ్ళాలనే లక్ష్యంతో అందరిని కలుపుకుని ముందుకు సాగుతున్నామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవర్‌పేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతోనే మేయర్ టీమ్‌ను టీడీపీలోకి కలుపుకున్నామన్నారు. ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

సేవలందించలేకపోయాం : మేయర్

మొదటిసారి మేయర్‌గా పనిచేసిన ఐదేళ్లలో నగరాన్ని ఎమ్మెల్యే బుజ్జి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశాం. రెండోసారి ఎంపికైన అనంతరం వైసీపీ ప్రభుత్వ పాలనలో గత మూడేళ్లలో ప్రజలకు సంతృప్తికరమైన సేవలందించలేకపోయాం. ఏ అభివృద్ధి పని చేయాలన్న నాయకులు ఎన్నో అడ్డంకులు సృష్టించేవారు. ప్రతీ పనికి అప్పటి ఎమ్మెల్యే నాని అడ్డుపడేవారు. మాకు స్వేచ్ఛ లేకపోయింది. ప్రభుత్వ సహకారం లేదు. నిధులు, గ్రాంట్లు విడుదల కాలేదు. మిగిలిన రెండేళ్ల పదవీ కాలంలో నగరాన్ని అభివృద్ధి చేయాలంటే టీడీపీలోకి రావడమే ఏకైక మార్గమని భావించి ఎమ్మెల్యే చంటి చొరవతో మళ్లీ పార్టీలో చేరాం. వైసీపీ నాయకుల ఒత్తిడితోనే అప్పుడు ఆ పార్టీలోకి వెళ్లాం. తిరిగి టీడీపీలో చేరడం సొంత గూటికి వచ్చినంత ఆనందంగా ఉంది. ప్రజాసేవ చేసే కూటమి ప్రభుత్వం ద్వారా నిధులు తెచ్చి నగరాన్ని అభివృద్ధి పరుస్తాం' అని మేయర్ నూర్జహాన్, పెదబాబు అన్నారు. సమావేశంలో బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు, ఎంఆర్‌డీ బలరామ్, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు బీసీ బాలికల వసతి గృహం-2లో మరుగుదొడ్ల దుస్థితి

హాస్టళ్లకు.. మంచిరోజులు!

వసతి గృహాల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి

- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- తలుపులు లేని కిటికీలు.. పెచ్చులూడుతున్న శ్లాబులు
- ఎనిమిది నెలలుగా మెనూ ఛార్జీలు బకాయిలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- అంచనాలు తయారు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు



అమీనాపేట సమీకృత బాలుర వసతి గృహంలో బీటలు వారిన గోడలు.. కుంగిన నేల

ఏలూరు రూరల్, ఆగస్టు 27 : సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతిగృహాల అభివృద్ధిని గాలికి వదిలేసింది. జిల్లాలో అధికశాతం శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో ఎస్సీ, బీసీ, వసతి గృహాల్లో విద్యార్థులు తల దాచుకుంటున్నారు. ఈ పరిస్థితులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనతో పాటు భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించింది. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ పదేపదే పలికిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిపై కపట ప్రేమ చూపించారు. పేద పిల్లలు ఉండే వసతిగృహాలను పూర్తిగా గాలికివదిలేసి వారి జీవితాల్లో చీకట్లోకి నెట్టారు. మెనూ ఛార్జీలు పెంచుతామంటూనే ఉడకని అన్నం, నీళ్ళ చారు, పులిసిన మజ్జిగ, పల్లీ పట్టీలు పెట్టారు. మరుగుదొడ్లు బాగోలేక కనీసం మంచినీరు



ఏలూరు బీసీ బాలికల వసతిగృహం-1లో బీటలు తీసిన మరుగుదొడ్ల గోడలు

రాక జిల్లాలో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు నరకయాతన అనుభవించారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలు పూర్తిగా మారనున్నాయి. జిల్లాలో ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు 25, బీసీ హాస్టళ్లు 28, ఎస్టీ



బీసీ బాలికల వసతిగృహం- 1లో వంటశాల దుస్థితి

హాస్టళ్లు 7 ఉన్నాయి. గత ఐదేళ్లుగా వసతి గృహాల్లో కనీసం మౌలిక వసతులు లేక చాలామంది విద్యార్థులు ఖాళీచేసి వెళ్ళిపోయారు. బయట డబ్బులు కట్టి స్థోమత లేనివారు ఇక్కడే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. ఏలూరు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వసతిగృహాలు గోడలు పెచ్చులూడి, కిటికీల అద్దాలు పగిలిపోయాయి. తాగునీటి సమస్య, మరుగుదొడ్లు గదుల్లో అరకొర సౌకర్యాలు, పరిసరాలు చెత్తా చెదారం, తలుపులు లేని గదులు, అపరిశుభ్ర మరుగుదొడ్లు, తిరగని ఫ్యాన్లు, నీళ్ళు రాని కుళాయిలు వంటి సమస్యలు వేధిస్తున్నాయి. విద్యార్థులు నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి. పారిశుద్యం లోపించి ఈగలు, దోమలతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలోని చాలా వసతి గృహాల్లో నాల్గవ తరగతి సిబ్బంది లేరు. విద్యార్థులకు సరిపడా మౌలిక సదుపాయాలు లేవు. విద్యార్థులకు మెస్‌ఛార్జీలకు సంబంధించి గత ఎనిమిది నెలలుగా బకాయిలు ఉన్నాయి. అప్పులు చేసి వార్డెన్లు ఆహారం వండిస్తున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించింది. హాస్టళ్ల మరమ్మతు పనులకు, మౌలిక వసతుల కల్పనకు ఎంత ఖర్చవుతుందో అంచనాలు తయారు చేయాలంటూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వసతి లేని గృహాలకు వసతి కలుగుతుందని, సౌకర్యాలు మెరుగుపడతాయన్న ఆశతో విద్యార్థులు ఉన్నారు.

కుక్కలు.. భౌబోయ్

గ్రామాల్లో రోడ్లపై స్వైర విహారం 7

దోషులకు సత్వర శిక్ష పడినపుడే అత్యాచారాలకు ఫుల్‌స్టాప్

ఏలూరులో వైద్య విద్యార్థినులు, ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

రేపు గిరిజన గ్రీవెన్స్‌డే

ఏలూరు రూరల్/బుట్టాయగూడెం, ఆగస్టు 27 : ప్రతినెలా నాల్గవ గురువారం జిల్లా కలెక్టర్ ఏజెన్సీ మండలాల్లో గ్రీవెన్స్‌డే నిర్వహించి గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్, కేఆర్ పురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 29న కేఆర్‌పురం, ఐటీడీఏ, సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్‌డే నిర్వహించి ఏజెన్సీ ప్రాంత ప్రజల నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి వినతులు స్వీకరిస్తారన్నారు.

18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు కావాలి : కలెక్టర్

ఏలూరు సిటీ, ఆగస్టు 27 : జిల్లాలో 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సు పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కలిగించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2025 పై జిల్లాలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ- 2025 తయారీకి పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలు సర్వే చేయాలన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఓటరుగా నమోదయ్యేందుకు దరఖాస్తులు అందించాలన్నారు. ప్రతి కళాశాలలోను అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు అన్ని ఒకే పోలింగ్ బూత్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో పుష్పమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు 100 రోజుల ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల సాధన పూర్తి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళిక లక్ష్య సాధనపై కలెక్టర్ సమీక్షించారు.

ప్రతీ గ్రామంలో మొక్కలు నాటండి..

ఏలూరు టూటౌన్, ఆగస్టు 27 : ఆగస్టు 30వ తేదీ వనమహోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ప్రతీ ఇంటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని తొమ్మిది నర్సరీల్లో లక్ష మొక్కలను సిద్ధం చేశామన్నారు. పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు పంచాయతీ అధికారులు కృషి చేయాలన్నారు. చాట్రాయి, ఉంగుటూరు, నూజివీడు, బుట్టాయిగూడెంలలో మలేరియా, డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. గృహనిర్మాణ పనులపై అధికారులతో సమీక్షిస్తూ గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

స్పెషల్ కేటగిరీ టీచర్లకు సర్దుబాటు నుంచి ఉపశమనం

- రేపు సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటుకు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : మండలాల్లో సర్దుబాటు చేయగా ఇంకా మిగిలిన సర్‌ప్లస్ టీచర్లను డివిజన్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద తాత్కాలికంగా నియమించేందుకు కౌన్సెలింగ్‌ను ఈనెల 29న నిర్వహించడానికి విద్యాశాఖ తాజాగా నిర్ణయించింది. వాస్తవానికి ఈ కౌన్సెలింగ్ మంగళ, బుధవారాల్లో జరగాల్సి ఉంది. ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు డివిజన్‌స్థాయి కౌన్సెలింగ్ నుంచి స్పెషల్ కేటగిరీ టీచర్లయిన దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, అవివాహితలు, వితంతువులు, వైకల్యం వున్న వారికి మినహాయింపు ఇవ్వాల్సి వున్నందున వారి నుంచి ధ్రువీకరణ పత్రాల స్వీకరణ, జిల్లాస్థాయిలో పరిశీలించి అప్రూవల్ చేయాల్సి ఉండడం వంటి ప్రక్రియలు మంగళవారం నాటికి కూడా పూర్తికాకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. ఆ ప్రకారం ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజన్ కేంద్రాల్లో గురువారం డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌ను సంబంధిత డీవైఈవోలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌కు మొత్తం 592 మంది సర్‌ప్లస్ టీచర్ల జాబితా రాగా, వీరిలో 377మంది ఎస్జీటీలు, 215మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు.

చనిపోయిన వ్యక్తి ఎవరు ?

- ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మగ్గుతున్న మృతదేహం
- ఎమ్మెల్సీ కేసుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం



ఏలూరు క్రైం, ఆగస్టు 27 : ఏలూరు ప్రభుత్వాస్పత్రి రోగులకు వైద్యసేవలను అందించడంలో విఫలమవుతూ రోజూ విమర్శలకు గురవుతూనే ఉంది. చివరకు మృతదేహాల సమాచారం పోలీసులకు ఇవ్వడంలోను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. ఈనెల 22వ తేదీ రాత్రి ఒక వ్యక్తిని (35) చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి లో చేర్పించారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 23న మరణించాడు. వాస్తవానికి ఎమ్మెల్సీ కేసుల వివరాలను అత్యవసర విభాగంలో వైద్యసేవలు అందించేటప్పుడే ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎక్కడ ప్రమాదం జరిగింది, ఎవరు తీసుకొచ్చారు తదితర వివరాలు ఆస్పత్రి రికార్డుల్లో నమోదు చేసి ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ మరణిస్తే ఆ సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా తెలపాలి. ఔట్‌పోస్ట్ పోలీసులు సంబంధిత స్టేషన్ల పోలీసులకు సమాచారం అందిస్తారు. ఆ పోలీసులు బంధువుల సహకారంతో శవ పంచనామా చేసి బంధువులకు అప్పగిస్తారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కాని ఆస్పత్రిలో అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వైద్యసేవలు ఇష్టానుసారం కొనసాగుతున్నాయనే విమర్శలున్నాయి. ఎమ్మెల్సీ నమోదు, ఆ వివరాలు పోలీసులకు అందించడంలో వైఫల్యం కారణంగా మృతదేహాలు మార్చురీలో అనాధ శవాలుగా కుళిపోతున్నాయి. ఈనెల 22న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై అపస్మారకస్థితిలో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరిన మరుసటి రోజే మరణించడంతో ఆ మృతదేహాన్ని గుర్తు తెలియని మృతదేహంగా రికార్డులో నమోదు చేసి మార్చురీకి తరలించారు. ఇప్పటి వరకు ఆ సమాచారం ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇవ్వలేదంటే ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసు కోవచ్చు. ఆ వ్యక్తి సమాచారం కోసం కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతూ అతని ఆచూకీ కోసం ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇప్పటి వరకు ఆస్పత్రి ఉద్యోగులు తమ బాణీ ఇంతేనంటూ వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆ మృతుడి వివరాలు సేకరించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

20 మంది పనిచేస్తే.. వంద మందికి కూలి!

- ఒక పని ఫొటో.. పది పనులకు అప్‌లోడ్
- కంప్యూటర్ ఆపరేటర్‌కూ మస్తర్లు
- మూడేళ్లపాటు కూలీగా క్యాన్సర్ బాధితురాలు.. పైసా చెల్లించని వైనం
- ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ



యలమంచిలి గ్రామసభలో విచారణ చేస్తున్న ఏపీడీ

యలమంచిలి, ఆగస్టు 27 : 'ఇరవై మంది పనిచేస్తే.. వంద మందికి మస్తర్లు వేస్తున్నాడు. పనిచేస్తున్న ఒకే ఫొటోను 10 వర్క్‌లకు అప్‌లోడ్ చేస్తున్నాడు. కొందరు పనికి వెళ్లకపోయినా ఉపాధి హామీ పథకం కూలీలుగా చూపించి మస్తర్లు వేశాడు. ఇలా ఒక కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడు ఎప్పుడూ పనికి వెళ్లకపోయినా గత ఏడాది వారికి రూ.60 వేలు చెల్లించారు. యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలోని ఎన్‌ఆర్‌జీఎస్ విభాగం మహిళా కంప్యూటర్ ఆపరేటర్‌కు ఉపాధి కూలీగా మస్తర్లు వేశారు' అంటూ యలమంచిలిలో ఎన్‌ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దొంగ మాణిక్యాలరావు గ్రామస్తులు ఆరోపించారు. వీరు ఇచ్చిన ఫిర్యాదుపై గ్రామీణాభివృద్ధి శాఖ భీమవరం క్లస్టర్ ఏపీడీ పి.సుజాత మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ చేసిన అవకతవకలపై 120 పేజీలతో కూడిన ఆధారాలను ఫిర్యాదుదారులు అధికారికి అందించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ 'ఒకే ఫొటోను ఇన్ని వర్క్‌లకు అప్‌లోడ్ చేయడం నిబంధనలను అతిక్రమించడమే. ఇలా ఎందుకు చేశారు. తరచుగా మేన్యువల్‌గా ఎందుకు మస్తర్లు వేస్తున్నారు' అని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన నుంచి సమాధానం రాలేదు. ఉపాధి కూలీల పేర్లను చదువుతూ ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. జరుగుతున్న అక్రమాలపై పలువురు గ్రామస్తులు వివరించారు. అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ఏపీడీని కోరారు. విచారణలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో సమావేశం రసాభాసగా మారింది. పోలీసులు సిబ్బంది, అధికారులు సర్దిచెప్పడంతో విచారణ కొనసాగింది. బర్రే భూలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ 'నేను క్యాన్సర్‌తో బాధపడుతున్నా. మూడేళ్లుగా ఉపాధి కూలీగా పనిచేస్తున్నా ఇంత వరకూ పైసా కూడా చెల్లించలేదు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే అదిగో ఇస్తాను.. ఇదిగో ఇస్తాను చెబుతున్నాడు. నాకు న్యాయం చేయాలి' అని ఆమె కోరింది. ఒక క్యాన్సర్ పేషెంట్‌ను కూడా మోసం చేస్తారా ? అని ప్రజలు మండిపడ్డారు. విచారణపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఏపీడీ తెలిపారు.

ఆగిరిపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహం అపహరణ

నూజివీడు, ఆగస్టు 27 : చారిత్రక ప్రసిద్ధిగాంచిన ఆగిరిపల్లి ఎగువ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఉత్సవ విగ్రహాల్లో ఒకదానిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దుండగులు ఆలయ తాళాలు పగులగొట్టి స్వామి వారి ఉత్సవ విగ్రహంతోపాటు గంటలు, వెండి పూజా సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ విషయం సోమవారం రాత్రి జరిగిందా ? మంగళవారం జరిగిందా ? అన్న విషయం తెలియడం లేదు. ఆలయ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఉంచినట్లు భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ విషయం పోలీసులకు తెలియడంతో వారు దేవదాయ శాఖ అధికారులను ప్రశ్నించడంతో విషయం



చోరీకి గురైన కొండపై లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహం (ఫైల్)

వెలుగుచూసింది. ఆలయంలో 14 సీసీ కెమేరాలు వున్నప్పటికీ ఒక్కటి కూడా పనిచేయకపోవడం గమనార్హం. మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిస్తున్నారు. ఎంతో ప్రాశస్త్యం వున్న ఆలయంలో ఉత్సవ విగ్రహం అపహరణకు గురికావడం, దీనిని ఎవరికి తెలియకుండా గుట్టుగా వుంచడం తీవ్ర సంచలనం రేపుతోంది. సుమారు 900 మెట్లు కలిగిన కొండపై నిర్మానుష్యంగా ఉంటుంది.



ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోయిన నగలు దొరికాయి..



ద్వారకాతిరుమల, ఆగస్టు 27: ద్వారకాతిరుమల పెళ్లికి వచ్చి అక్కడి మండపంలో నగలు పోగొట్టుకున్న వారికి ఆలయ అధికారులు ఆ నగలను తిరిగి అప్పగించారు. ద్వారకా తిరుమల ధర్మఅప్పారావు నిలయంలో ఈనెల 23న పెళ్లి జరిగింది. గుంటూరుకు చెందిన పేరం నాగేశ్వరరావు కుటుంబం తమ బంగారు నగలను గదిలో మర్చిపోయి వెళ్లిపోయారు. వజ్రపు ఉంగరం, గాజు, నల్లపూసల గొలుసు, దుద్దులు కనిపించక పోవడంతో అంతా వెదికి చివరకు దేవస్థానం అధికారుల తెలిపారు. అయితే ఈ నగలను గుర్తించిన అక్కడి సిబ్బంది వాటిని ఆలయ అధికారులకు అప్పగించారు. అధికారులు ఈ విషయాన్ని ఫోన్‌లో యజమానికి తెలియపర్చగా పోయిన వస్తువుల వివరాలు చెప్పారు. ఇక్కడకు వచ్చే వీలు లేకపోవడంతో స్థానికంగా ఉన్న వారి బంధువులకు ఈ నగలను అప్పగించారు.



4వ తేదీ నుంచి అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, ఆగస్టు 27 : వచ్చేనెల నాల్గవ తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తామని అండర్19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు.అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వచ్చే డిసెంబరు నెల 31వ తేదీనాటికి 19 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, ప్రతిభ ఆధారంగా జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని వివరించారు. వచ్చేనెల సెప్టెంబరు 4వ తేదీన పెదవేగి గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు, 6వ తేదీన బాలురకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బాడ్మింటన్, హేండ్‌బాల్, 10వ తేదీన బాల, బాలికలకు త్రోబాల్, టెన్నికాయిట్, చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 13వ తేదీన బాలికలకు సంబంధించి ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో బాస్కెట్ బాల్, హేండ్‌బాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 17వ తేదీన బాల, బాలికలకు సంబంధించి ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో, కరాటే, స్కేటింగ్, 18వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాల, బాలికలకు ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. 19వ తేదీన తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బాలికలకు సంబంధించి టేబుల్ టెన్నిస్, చెస్, బాడ్మింటన్ వాలీబాల్, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయని వివరించారు. 20వ తేదీన ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాలలో బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్ బాలురకు, క్రికెట్ బాల, బాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. 21వ తేదీన భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, షూటింగ్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, నెట్‌బాల్, జిమ్నాస్టిక్ పోటీలు జరుగుతాయని, అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో అయా చోట్ల జరిగే పోటీలకు హాజరుకావాలని సూచించారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

క్రీడలతో జాతీయ సమైక్యత : జేసీ

భీమవరం రూరల్ ఆగస్టు 27 : క్రీడలు జాతీయ సమైక్యత భావాలను పెంపొందిస్తాయని ఒలింపిక్స్‌లో కూడా మన క్రీడాకారులు ఎన్నో విజయాలు సాధించడం గొప్ప విశేషమని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. క్రీడాభివృద్ధి శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని భీమవరంలో మూడు రోజుల పాటు నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ జ్యోతి, క్రీడా ప్రతిజ్ఞ కార్యక్రమాలను జేసీ ప్రారంభించారు. బాల్యం నుంచి క్రీడల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు ఆసక్తి కలిగించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడల్లో ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి రాజేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, 29న ప్రశంసా పత్రాలను అందిస్తామని అన్నారు. డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ మోజేష్, తహసీల్దార్ రవి రాంబాబు, చెరుకువాడ రంగ సాయి, కళాశాల పీడీ నరసింహరాజు, పీఈటీలు శేఖర్ రాజు, రామబద్రి రాజు, పీవీ నరసింహరాజు, డా గాదిరాజు రంగరాజు క్రీడా ర్యాలీలో పాల్గొన్నారు.

జడ్పీ బాలెన్స్ షీట్ అందని చందాదారులు హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించండి

ఏలూరుసిటీ, ఆగస్టు 27: జిల్లా పరిషత్ యాజమాన్యం భవిష్యనిధి చందాదారుల 2020-21 నుంచి 2023-24 సంవత్సరం వరకు జమ, ఖర్చు వివరాలు ముసాయిదా బాలెన్స్ షీట్‌లను, 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాల రివైజ్డ్ బాలన్స్ షీట్‌లను సంబంధిత డీడీవో కార్యాలయ ఈ మెయిల్ అడ్రస్‌లకు ఈనెల 16వ తేదీన జారీ చేసినట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు. బాలెన్స్ షీట్లు అందని చందాదారులు ఎవరైనా జడ్పీ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసినట్టయితే జారీ చేస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు దర్శిపర్రు విద్యార్థినులు



ఎస్.తేజశ్రీ, గాయిత్రి , హాసిని శ్రీదుర్గ

పెంటపాడు, ఆగస్టు 27 : మండలంలోని దర్శిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వ్యాస రచనలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవోలు శ్రీనివాస్, రామ కృష్ణ తెలిపారు. విద్యార్థినులు ఎస్.తేజశ్రీ (10వ తరగతి), పంతం గాయిత్రి (9వ తరగతి), పీ.హాసినిదుర్గ (8వ తరగతి) ఈ నెల 12వ తేదీన మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపర్చి జిల్లాస్థాయికి చేరుకున్నార న్నారు. మంగళవారం భీమవరం పొట్టి శ్రీరాములు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపి కయ్యా రన్నారు. విద్యార్థినులను గైడ్ చేసిన టీచర్ వయోలా, హెచ్‌ఎం కేవీ.సత్యనా రాయణ మూర్తిలను సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ మార్కండేయులు, ఎంఈవోలు అభినందించారు.

స్వదేశానికి చందు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 27: స్నేహితులతో కలిసి ఖజకిస్తాన్ విహార యాత్రకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు (49) మృతదేహం మంగళవారం రాత్రి స్వగ్రామానికి వచ్చింది. మూడు రోజుల క్రితం ఖజకిస్తాన్‌లో మృతి చెందిన చందు మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు మంత్రులు లోకేశ్, నిమ్మల రామానాయుడు ఖజకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసీతో మాట్లాడి స్వదేశం రప్పించేందుకు కృషి చేశారు. చందు అంత్యక్రియలు బుధవారం పెదతాడేపల్లిలో జరగనున్నాయి.

కుక్కలు.. భౌ బోయ్



ఆచంట, ద్వారకాతిరుమల రోడ్లపై కుక్కల గుంపులు



వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి.. గ్రామాల్లో రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి.. వాహనాలపై వెళ్లేవారిని తరుముతున్నాయి..దాడి చేసి కరుస్తున్నాయి..కుక్కలు ఉంటున్న వీధి వైపు వెళ్లాలంటేనే జనం భయంతో ఒణికిపోతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఆచంట ఆగస్టు 27: ఏ గ్రామంలో..ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్లపై వెళ్ళే వాహనాలను కూడా అడ్డుకుంటున్నాయి.రాత్రి వేళల్లో నడిచి వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతాలో వదిలి వేస్తే భయం తగ్గుతుందని పలువురు వాపోతున్నారు.

యలమంచిలి : మండలంలోని గ్రామాల్లో ప్రతి కూడలి వద్ద సుమారు 20కి పైగా కుక్కలు ఉంటున్నాయి. బయటకు అడుగుపెట్టాలంటే భయపడిపోతున్నారు.వారం రోజుల్లో చించినాడ గ్రామంలో 10 మంది, యల మంచిలిలో ఒకరు, మేడపాడులో ఒకరు కుక్కకాటుకు గురయ్యారు. చించి నాడ గ్రామ పంచాయతీ కూడలి సమీపంలో ఒకే రోజు 10 మంది కుక్క కాటు బారినపడ్డారు. వీరిలో కొంతమంది బైక్‌పై వెళుతుండగా కుక్కలు వెంటబడి కరిచాయి.యలమంచిలి తపాలా కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ మేడపాడు గ్రామంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి కుక్క కాటుకు గురయ్యాడు. పాఠశాలలకు వెళుతున్న దారుల్లో కుక్కలు గుంపులను చూసి విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు. కుక్కల సమస్యకు పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ద్వారకాతిరుమల : గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ క్షేత్రంలో భక్తులను, స్థానికులను బెంబేలిత్తిస్తున్నాయి. వాహదారులపై ఒక్కసారిగా ఉరకడంతో ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. కొన్ని వీధి కుక్కలకు వైరస్ సోకి ప్రమాద భరితంగా తయారయ్యాయి. వీటిని చూసి క్షేత్రానికి వచ్చిన భక్తులు మరింత భయపడుతున్నారు.

ఆకివీడు : కుక్కలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా జనాన్ని కరుస్తున్నాయి. వీధుల్లో ఒంటరిగా వెళ్ళలేకపోతున్నారు.అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.



యలమంచిలిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

భీమవరం క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. వీధుల్లోనూ, మెయిన్ రోడ్‌లపై ఎక్కడపడితే అక్కడ మీద పడి కరుస్తున్నాయి. ఇటీవల కాలంలో కుక్కలు బెడద పెరిగిపోయింది. రెండేళ్ల కిత్రం శ్రీరాంపురం బలుసుమూడి ప్రాంతంలో కుక్కలు సుమారు 20 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అలాగే గతేడాది డిసెంబరులో ఇద్దరు చిన్నారులపై బైపాస్ రోడ్డులో వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. పట్టణంలోనే కాకుండా భీమవరం మండలంలోని పలు గ్రామాల్లో కూడా వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. కొంత వరకు కుక్కలను అరికట్టేవారు. ఇప్పుడు అలాంటి చర్యలు ఏమీ లేకపోవడంతో కుక్కలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

చాట్రాయి : మండలంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి రేయింబవళ్ళు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రతి వీధిలోను, వ్యవసాయ భూముల్లో కుక్కలు మందగా సంచరిస్తూ మనుషులు, పశువులు, మేకలు, గొర్రెలపై దాడులకు తెగబడుతున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారుల వెంట పడుతుండటంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. కోళ్ళ ఫారాలు, చికెన్ సెంటర్‌ల నుంచి వచ్చే వ్యర్థాలను గ్రామ శివార్లలో పారబోస్తుండటంతో వాటిని తిని బలిష్టంగా తయారై దాడులకు తెగబడుతున్నాయి.



అయి-భీమవరం రోడ్‌లో బైఠాయించిన ఆక్రమణదారులు

అయి-భీమవరం రోడ్‌లో ఆక్రమణల తొలగింపు

ఆక్రమణదారులతో కలిసి ఆందోళనకు దిగిన సీపీఎం

ఆకివీడు, ఆగస్టు 27 : ప్రజలకు సరఫరా చేసే మంచినీటిలో మురుగు నీరు కలుస్తుండడంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఎమ్మెల్యే రఘు రామరాజు అన్నారు. అయి-భీమవరం రోడ్ మార్జిన్ ఆక్రమణదారుల ఇళ్లను అధికారులు, పోలీసుల సమక్షంలో మంగళవారం తొలగింపునకు చర్యలు చేపట్టగా సీపీఎం నేతలు అడ్డుకుని ఆక్రమణదారులతో కలిసి రాస్తారోకో చేశారు. ఆక్రమణదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన వెళ్లలేదని అధికారులు చెబుతున్నారు. స్థానిక వెంకయ్య వయ్యేరు నుంచి దుంపగడప మంచినీటి చెరువుకు వెళ్ల పంటబోదెలోకి మురుగునీరు, వ్యర్థాలు కలుస్తున్నాయని అందుకే ఆక్రమణలు ఖాళీ చేయిస్తున్నట్టు టీడీపీ శ్రేణులు ఆక్రమణదారులకు వివరించారు. సమయం ఇస్తే ఖాళీ చేస్తామని ఆక్రమణదారులు కోరారు. అయినా అధికారులు తొలగింపు చేపట్టడంతో ఆక్రమణదారులతో పాటు సీపీఎం నాయకులు అడ్డుకున్నారు.

వ్యర్థాలతో కలుషితం చేస్తున్నారు : డీపీవో

అయి-భీమవరం రోడ్‌లోని ఆక్రమణదారుల ఇళ్లతో పాటు దుంపగడప పంటబోదెలోకి వ్యర్థాలు వదిలే ప్రాంతాలను మంగళవారం డీపీవో విక్టర్ పరిశీలించారు. స్థానిక వెంకయ్య వయ్యేరు కాలువ నుంచి దుంపగడప మంచి నీటి చెరువుకు వెళ్లే నాలుగు కిలోమీటర్ల పొడవునా ఆక్రమణదారులు, ఆసుపత్రి, బంకులు, హీరోహుండా షోరూమ్, సర్వీసింగ్ సెంటర్, ఆక్వా చెరవులకు సంబంధించిన వ్యర్థాలు పంటబోదెలోకి వదలడంతో పాటు గంగానమ్మ, మూలలంక బోదెలకు సంబంధించిన మురుగునీరు కలుస్తుండడంతో తాగునీరు కలుషితమవుతుందన్నారు.

పెరుగుతున్న గోదావరి

వేలేరుపాడు/పోలవరం ఆగస్టు 27: తెలంగాణ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద భారీగా చేరుకుంటున్నది. ఖమ్మం, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. రెండురోజుల క్రితం వరకు కూడా ఇసుక దిబ్బలతో దర్శనమిచ్చిన గోదావరి నేడు నీళ్ళ కుండలా మారింది. మండలంలోని ఎద్దువాగు, టేకూరువాగు వంతెనల పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణాలో మరో రెండు, మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. గోదావరి నదికి వరద ఉధృతి పెరిగే అవకాశాలున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నది. మంగళవారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో 4,14,380 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు.నీటిమట్టం పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలు నీటమునిగాయి. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదలైన జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి కలుస్తున్నాయి. గోదావరి నీటిమట్టం పెరగడంతో గండిపోశమ్మ ఆలయానికి అధికారులు రాకపోకలను నిలిపివేశారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం

దోషులకు సత్వర శిక్ష పడినపుడే అత్యాచారాలకు ఫుల్‌స్టాప్

ఏలూరులో వైద్య విద్యార్థినులు, ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : కోల్‌కతా ఆర్జీకర్ వైద్య కళాశాల పీజీ విద్యార్థి హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల విద్యార్థినులు, 'ఐద్వా' మహిళాసంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాల నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్‌వరకు ప్రదర్శన, మానవహారం, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రదర్శనలు జరిగాయి. దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్లీవరాజు మాట్లాడుతూ రోగుల ప్రాణాలను రక్షించే వైద్యుల భద్రతకు ముప్పు వాటిల్లిందని కోల్‌కతా సంఘటనలు రుజువు చేసాయన్నారు. సినిమాలు, ఇంటర్నెట్ మాధ్యమాల్లో హింస, అశ్లీలతలను అరికట్టాలని కోరారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ దేశంలో మహిళా చట్టాలున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో జాప్యం కారణంగానే మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి మాట్లాడుతూ మెడికో వైద్యురాలిపై హత్యోదంతం సభ్యసమాజం తలదించుకునేలా చేసిందన్నారు. కొత్త చట్టాలు ఎన్నో చేస్తున్నప్పటికీ ప్రతీరోజు ఏదోఒకచోట మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఒక్క ఏలూరు నగరంలోనే గత ఆరునెలల్లో ఆరుగురిపై హత్య, అత్యాచారఘటనలు వెలుగుచూశాయని వివరించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అన్నిచోట్ల ఏర్పాటుచేసి దోషులకు వెంటనే కఠినశిక్షలు పడేలా చూడాలని నిర్భయ ఉదంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ చేసిన సిఫారసులను రాష్ట్రప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో దంతవైద్య కళాశాల ఫ్యాకల్టీ డాక్టర్ రాజశేఖర్, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, పరీక్షల కంట్రోలర్ సిస్టర్ సుశీల, ఐద్వా నాయకులు జయహరీష్, దుర్గ, సీఐటీయు నాయకులు కిషోర్, డీవైఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకానగర్‌లో బైక్ దొంగల కలకలం

ద్వారకాతిరుమల, ఆగస్టు 27: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకానగర్‌లో సోమవారం రాత్రి బైక్ దొంగలు హల్‌చల్ చేశారు. నలుగురు వ్యక్తులు ఓ ఇంటికి వెళ్లి అక్కడున్న బైక్‌ను దొంగిలించబోయారు. అయితే ఆ చప్పుడుకు లేచిన ఇంటి యజమాని సంజు బయటకు వచ్చి కేకలు వేయడంతో ఆ నలుగురు పరుగులు తీశారు. ముగ్గురు పారిపోగా ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని పట్టుకుని అక్కడే ఓ స్తంభానికి కట్టివేసిన స్థానికులు భీమడోలు పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆ ప్రాంతం తమపరిధిలో లేదని వారు వెళ్లిపోయారు. దీంతో ఇంటి యజమాని ద్వారకాతిరుమల పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దొంగను పట్టుకుని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలు సేకరించారు.



ద్వారకాతిరుమల సప్తగోకులంలో హారతులందుకుంటున్న శ్రీకృష్ణుడు. గోసంరక్షణశాలలో గోవులకు భక్తుల పూజలు

నేత్రపర్వంగా..శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 27: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చినవెంకన్న క్షేత్రంలో మంగళవారం నేత్రపర్వంగా జరిగాయి. అష్టమి మిగులు తిథిని, రోహిణి నక్షత్ర ఆగమనాన్ని పురస్కరించుకున్ని జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఉదయం శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో గోవులకు పూజలు చేశారు. సప్తగోకులంలో ఉన్న శ్రీకృష్ణుని దర్శించి పూజించారు. చినవెంకన్న ఆలయంలో శ్రీవారి ఆస్థానంలో కృష్ణుని విగ్రహానికి అర్చకులు, పంచామృత అభిషేకాలు, తిరుమంజన సేవ నిర్వహించారు. 12 సేవాకాలాలు నిర్వహించి 12 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. బుధవారం సాయంత్రం క్షేత్రంలో ఉట్లోత్సవం జరుగుతుంది.



ప్లకార్డులతో వాణిజ్యపన్నుల ఉద్యోగుల ప్రదర్శన

గత ప్రభుత్వ బలవంతపు బదిలీలను సరిదిద్దండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రాంతీయ కార్యాలయాలకు 'ఆర్డర్ టు సర్వ్' పేరుతో బలవంతంగా ఉద్యోగులను బదిలీ చేసిన వారందరినీ వారివారి పూర్వపు కార్యాలయాలకు వెనక్కి పంపించిన తర్వాతే సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులోని జేసీటీవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేషకుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా 2.0లో రాష్ట్రంలో మూడు ప్రాంతీయ కార్యాలయాలను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, నోడల్ పరిధిలోని జిల్లాల్లో పనిచేయాల్సి వున్న ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు 6 నెలల స్వల్పకాల వ్యవధికి విధులు అంటూ వేరే నోడల్ పరిధిలోని జిల్లాలకు ఏకపక్షంగా బదిలీలు చేసిందని, ఆ ఉద్యోగులను ఇంతవరకు వారి సొంత నోడల్ పరిధికి పంపలేదని వివరించారు. చివరకు అంధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వితంతువుల కుండే మినహాయింపులు కూడా ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా బదిలీలు చేసిందన్నారు. దీని వల్ల కాకినాడ నోడల్ పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాల వాణిజ్య పన్నుల కార్యాలయాల్లో దిగువశ్రేణి మొదలుకుని క్లరికల్ సిబ్బంది, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, తదితర ఉద్యోగులందరూ కుటుంబాలకు దూరంగా ఏళ్ళ తరబడి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఉద్యోగుల పిల్లల చదువులపై తీవ్రప్రభావం పడుతోందని వివరించారు. తక్షణమే ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని కోరారు. ఉద్యోగు లందరికీ సమన్యాయం జరిగేలా తమ శాఖలో బదిలీలను వాయిదా వేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరామన్నారు.

క్రైం కార్నర్

మూడు రోజుల క్రితం అదృశ్యం.. కాలువలో మృతదేహం

భీమవరం క్రైం, ఆగస్టు 27 : భీమవరం ఉండి రోడ్‌లో ఉన్న కాలువలో మంగళవారం పోలీసులు ఒక మృతదేహాన్ని కనుగొన్నారు. టూటౌన్ ఏఎస్‌ఐ మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం సత్యవతినగర్‌లో నివాసం ఉండే పాలా సుబ్బారావుకు ఒక కుమార్తె ఉంది. ఆమెకు వివాహమైంది. అయితే ప్రస్తుతం తండ్రి వద్దే ఉంటున్నది. అప్పుడప్పుడు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోతూ ఉంటుంది. ఈనెల 24వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కుమార్తె దేవి (33) కనిపించడం లేదంటూ 26వ తేదీన ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం కాలువలో మృతదేహం ఉందంటూ సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్ళారు. దేవి మృతదేహంగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 27 : ఏలూరు టుటౌన్ రామచంద్రపేటకు చెందిన కడిమి కిశోర్ (37) ఫ్లెక్స్ ప్రింటింగ్ పని చేస్తున్నాడు. భార్య పిల్లలను తీసుకుని మంగళవారం ఓ శుభకార్యానికి వెళ్లింది. అయితే భార్యకు మంగళవారం సాయంత్రం కిశోర్ ఫోన్ చేసి ఇంటికి వచ్చే సమయానికి మంచి గిఫ్ట్ ఇస్తానని చెప్పాడు. వారికి అనుమానం కలిగి పక్క ఇంటివారికి ఫోన్ చేశారు. వారు తలుపులు కొట్టగా ఉరి వేసుకుని కన్పించాడు. దీంతో తలుపులు పగులకొట్టి ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడని ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు.

తల్లి మందలించిందని వెళ్లిపోయాడు

పాలకోడేరు, ఆగస్టు 27: తల్లి మందలించిందని ఇంటి నుంచి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన సంఘటన గొరగనమూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. దీనిపై తండ్రి సతీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మోహనరావు తెలిపారు. గొరగనమూడి పెదపేటకు చెందిన తులసీ అవినాష్ భీమవరంలోని కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. సోమవారం సెలవుదినం కావ డంతో ఇంటివద్దే ఉన్న అవినాష్‌ను తల్లి మందలించింది. దీంతో అవినాష్ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుంచి వెళ్తున్న సమయంలో అవినాష్ ఒంటిపై గ్రీన్ టీషర్ట్, బ్లాక్ నిక్కర్ ధరించి ఉన్నాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ళ వద్ద గాలించినప్పటికి ఎటువంటి ఆచూకి లభ్యం కాకపోవడంతో మంగళవారం పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీయత్నం

పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

పెంటపాడు, ఆగస్టు 27: వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసు దొంగిలించేందుకు యత్నించిన ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని వల్లూరుపల్లి గ్రామానికి చెందిన శీలంశెట్టి లక్ష్మీనారాయణమ్మ (55) అలంపురం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్ళింది. తిరిగి తన గ్రామానికి నడిచి వస్తుండంగా రాచర్ల గ్రామం దాటిన తరువాత వెనుక నుంచి మోటర్‌సైకిల్‌పై ఒక మగవ్యక్తి, మహిళ వచ్చి రాచర్ల గ్రామానికి ఎటు వెళ్ళాలని లక్ష్మీనారాయణమ్మను అడిగారు. మీరు రాచర్ల దాటి వచ్చేశారని వెనక్కి వెళ్లాలని బదులిచ్చింది. దీంతో వెనక్కి వెళ్ళిన ఇద్దరూ మరలా ఆమె వద్దకు వచ్చి మామ్మగారు..బండి ఎక్కండి..మిమ్మల్ని మీ ఊర్లో దింపుతామన్నారు. దీనికి లక్ష్మీనారాయణమ్మ వద్దు మా ఊరు వచ్చేసింది..మీరు వెళ్ళండి అని చెప్పింది. అయితే చాలా సేపు ఆమెను బండి ఎక్కమడి ఆ మహిళ సతాయించింది. అనంతరం ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునేందుకు ప్రయత్నింగా లక్ష్మీనారాయణమ్మ ఒక్కసారిగా పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో బైక్ పై వచ్చిన వారిద్దరూ అక్కడి నుంచి ఉడాయించారు. బైక్‌పై అటుగా వచ్చిన వ్యక్తిని తన గొలుసు లాక్కు వెళ్లిపోతున్నారని పట్టుకోవాలని కోరడంతో ఆ వ్యక్తి వారిని వెంబడించాడు. వల్లూరుపల్లి సెంటర్‌లోకి వెళ్ళిన తరువాత అక్కడ ఉన్న స్థానికులతో విషయం చెప్పడంతో అప్పటికే పుంత రోడ్డు నుంచి పొలాల్లోకి వెళ్ళిపోతున్న ఇద్దరిని స్థానికులు వెంటపడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పెనుగులాటలో వృద్ధురాలి కొంగుకే బంగారు గొలుసు చిక్కుకుని ఉంది. స్థానికులు చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులకు అప్పగించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఉమా మహేశ్వరి కేసు నమోదు చేశారు.

బ్లేడ్‌తో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం

పెదపాడు, ఆగస్టు 27 : ఇంట్లో గొడవ జరగడంతో బ్లేడుతో చేయి కోసుకుని ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కృష్ణా జిల్లా రామవరప్పాడు ప్రాంతానికి చెందిన మోహన్ అనే యువకుడు పెదపాడు మండలం కలపర్రు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు మీద కూర్చొని బ్లేడుతో చేయి కోసుకున్నాడు. సమాచారం అందుకున్న పెదపాడు ఎస్సై శుభశేఖర్ హైవే పోలీసులకు సమాచారం అందించడంతో హెడ్‌కానిస్టేబుల్ కమలాకర్, హోంగార్డు రాంబాబులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

పెనుగొండలో గంజాయి స్వాధీనం

పెనుగొండ, ఆగస్టు 27 : పెనుగొండలో మూడున్నర కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పెనుగొండ సర్కిల్ ఇనస్పెక్టర్ రజనీ కుమార్, ఎస్ఐ గంగాధర్ తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి పెనుగొండ తరలిస్తుండగా పెనుగొండ వ్యవసాయ మార్కెట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశాకి చెందిన సానియా హంతల, విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన పాస్టం దుర్గయ్య గుంటూరు జిల్లా పెదనందిపాడుకు చెందిన పాలపర్తి చిన్నిలను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ పెనుగొండ సంత మార్కెట్‌లో ఉంటున్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తి వీరికి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విగతజీవిగా స్వదేశానికి..

మస్కట్ వెళ్లిన కొద్దికాలానికే అనారోగ్యం.. హైదరాబాదు నుంచి బస్సులో వస్తుండగా మృతి



అత్తిలి, ఆగస్టు 27: ఉపాధి కోసం మస్కట్ వెళ్ళిన మహిళ ఆరోగ్య సమస్యలతో తిరిగి స్వదేశానికి వస్తూ మార్గమధ్యంలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తిలి మండలం మంచిలికి చెందిన బొంతా సత్యపద్మ విజయవాడకు చెందిన మహిళా ఏజెంట్ ద్వారా గతేడాది ఆగస్టులో మస్కట్‌కు వెళ్ళింది. అయితే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో సమాచారాన్ని తన భర్త ప్రభాకర్‌కు తెలిపింది. దీంతో తన భార్యను స్వదేశానికి పంపాలని ఏజెంట్‌ను కోరడంతో డబ్బులు కడితే కాని పంపించడం జరగదని చెప్పడంతో అప్పు చేసి ఏజెంట్‌కు రూ. 2.10 లక్షలు చెల్లించాడు. అయితే ఏజెంట్ తన భార్యను ఈనెల 30న ఇండియాకు పంపిస్తానని చెప్పి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈనెల 24న ఇండియాకు విమానం ఎక్కించి పంపిందన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆర్‌టీసీ బస్సులో వస్తుండగా పద్మ గుండెపోటుతో బస్సులోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభాకర్ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి పుట్టినిల్లు నిడదవోలు మండలం కోరుమామిడి.

కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 27: జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. భవన నిర్మాణానికి సమగ్ర అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. జేసీ ఛాంబర్‌లో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల నుంచి రూ. 20 కోట్లు గ్రంథాలయ సెస్ రావల్సి ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు వెంటనే 10శాతం బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. భవనం నిర్మించే వరకు రైల్వే స్టేషన్ ఎదురుగా యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గ్రంథాలయాన్ని నిర్వహించాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శిని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు, గ్రంథాలయాధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

ఉంగుటూరు, ఆగస్టు 27: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. నారాయణపురం రైతు సేవా కేంద్రం, సొసైటీ, నాచుగుంట గాయత్రి ట్రేడర్స్ రైస్ మిల్లును మంగళవారం ఆమె పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వసతులు, ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. గాయత్రి మిల్ కెపాసిటీ, తేమశాతం కొలిచే యంత్రాలను, బ్లెండింగ్ మిషన్ పనితీరు, అందుబాటులో గోనె సంచుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సొసైటీ కంప్యూటరీకరణ తీరును జేసీ పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్.రాజు, మేనేజర్ మంజుభార్గవి, డీసీవో.ఎ.శ్రీనివాస్, ఏడీఏ పి.ఉషాకుమారి తహసీల్దార్ పి.సతీష్, రెవెన్యూ, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా : డీఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 27 : పాత నేరస్తులు, జైలు నుంచి విడుదలైన నేరస్తులపై నిఘా ఉంచాలని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో సీఐలతో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాల నివారణ కోసం పోలీసులు గస్తీ పెంచాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ పోలీసు అధికారులు విజిబుల్ పోలిసింగ్ నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించాలన్నారు. మహిళా కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ లేకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకంలో 45 మంది బాల బాలికలకు లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో బ్యూలా

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 27: మిషన్ వాత్సల్య కార్యక్రమంలో తల్లిదండ్రులు లేని 45 మంది బాలబాలికలకు ప్రభుత్వం నగదు అందజేసిందని ఐసీడీఎస్ సీడీపీవో బ్యూలా తెలిపారు. ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో 45 మందికి నెలకు రూ.4వేల చొప్పున ప్రభుత్వం వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ వాత్సల్య కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు లేక నిరాదరణకు గురైన బాలలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని పెట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున ఆర్థిక సాయం అందించి వారి చదువులను కొనసాగించుకోవడానికి ఈ నిధులను ఖర్చు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ.ప్రసాద్, ఎంఈవో బి.రాముడు, డీటీ వరలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధ బదిలీలను రద్దు చేయాలి



ప్లకార్డులతో ఉద్యోగుల నిరసన

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 27: రాజ్యాంగ విరుద్ధంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేయాలని వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ జాయింట్ సెక్రటరీ ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ పిలుపుమేరకు మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు డివిజన్ జాయింట్ సెక్రటరీ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయాలను, సీఆర్‌యూలను రద్దు చేసి సర్కిల్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. జీఎస్‌టీవోలకు చట్టబద్ధత కల్పించాలని, ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానాన్ని రూపొందించాలన్నారు. కె.సత్యనారాయణ, ఎం.జయరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు



టేబుల్ టెన్నిస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఏలూరు రూరల్, ఆగస్టు 27: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండోర్ స్టేడియంలో పలు క్రీడాపోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీలను డీఎస్ఏ చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులకు హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ ఆదర్శమన్నారు. ఈనెల 31 వరకు వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా బ్యాడ్మింటన్, పరుగుపందెం, వాలీబాల్, టెన్నిస్ బాల్ క్రికెట్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 29న ముగింపు సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

జనసేన శ్రేణుల సేవా కార్యక్రమాలు



మొక్కలు నాటుతున్న జనసేన నాయకులు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సెప్టెంబర్ 2న జరుగుతుందని, నగరంలో జనసేన సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. అశోక వర్ధన స్కూలులో మంగళవారం మొక్కలు నాటారు. పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేసి, మదర్ థెరిసా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, వీరంకి పండు, దోసపర్తి రాజు, బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, గొడవర్తి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాల మేరకు జనసైనికులు పనిచేయాలి

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27: పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కార్యకర్తలు పనిచేయాలని జనసేన పార్టీ నేత కొఠారు ఆదిశేషు పిలుపునిచ్చారు. జనసేన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కల్పన, గ్రామ స్వరాజ్య స్థాపనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సభ్యత్వాలు నమోదుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పెద్దిశెట్టి నాని, పూజారి వెంకటరత్నం నాయుడు, పూజారి సీతారాం, మట్టా వెంకటేశ్వరరావు, మట్టా రంగారావు, పావులూరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిషప్ జయరావు జన్మదిన వేడుకలు



బిషప్ జయరావును సన్మానిస్తున్న ఫాస్టర్లు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 27: ఏలూరు కథోలిక పీఠాధిపతి రెవరెండ్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు బిషప్స్ హౌస్‌లో మంగళవారం నిర్వహించారు. కథలిక్ సంఘాల గురువులు, సిస్టర్లు, మఠకన్యలు, నేతలు బిషప్ జయరావును సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇమ్మానియేలు, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్, కె.నాగేశ్వరరావు, ఫాదర్ మైఖేల్, ఫాదర్ ఆరోన్, తదితరులు ఉన్నారు. 44వ డివిజన్ గన్‌బజారులో అక్షర సోషల్ సర్వీస్ సొసైటీ, సిటీన్యూస్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో జయరావు జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

అత్యాచారం, దాడులపై నిరసన







కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార సంఘటనకు నిరసనగా సెయింట్ థెరిసా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థినుల కళా ప్రదర్శనలు



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్యకళాశాల విద్యార్థినులు కళా ప్రదర్శనల ద్వారా మహిళలపై దాడులను కళ్లకు కట్టినట్లు వివరించారు. మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని, కోల్‌కతా సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కళాశాల నుంచి ర్యాలీగా ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఐద్వా, మహిళా సంఘాలు విద్యార్థినులకు మద్దతుగా పాల్గొన్నారు.



మహిళలపై దాడులకు ప్లకార్డులతో నిరసన



గ్రామసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ఉంగుటూరు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

పేద కుటుంబాలకు ఆసరా చంద్రన్న బీమా

పెదవేగి, ఆగస్టు 27: కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు చంద్రన్న బీమా ద్వారా చంద్రబాబు ఆసరాగా ఉన్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. 2019లో జగన్‌రెడ్డి చంద్రన్న బీమా పథకాన్ని నిలిపేయడంతో ఎంతోమంది పేదలు ఆర్థికంగా కుదేలయ్యారని ఆయన తెలిపారు. మీకోసం - మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా వంగూరు, కవ్వగుంట, జగన్నాధపురం, జానంపేట గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించిన చింతమనేని ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది పేద కుటుంబాలు పెద్ద కష్టం వచ్చినపుడు తట్టుకునే పరిస్థితి లేక ఇబ్బందులు పడేవారన్నారు. ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చంద్రన్న బీమా అమలు చేయడంతో ఎంతోమంది పేదలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని ఆయన చెప్పారు. జగన్‌రెడ్డి పాలనలో నిర్వీర్యం చేసిన పథకాల్లో చంద్రన్న బీమా ఒకటని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన చంద్రబాబునాయుడు అన్ని సంక్షేమ పథకాలను తిరిగి ప్రవేశపెట్టారని, ఇకపై రాష్ట్రం ఆర్థిక పురోభివృద్ధిని సాధించేలా మరింతగా కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభాకర్ వివరించారు. కార్యక్రమంలో బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, సుగసాని గంగాధరరావు, సుంకర భాస్కరరావు, గోపిశెట్టి లక్ష్మణరావు, కొట్టు నరేష్, రాయల గణేష్, చిలకలపూడి రమేష్, నర్నె జయబాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

ఉంగుటూరు: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు నాడు అన్ని గ్రామా లలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. ఉంగుటూరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 2న పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని కార్యకర్తలతో ఆయన చర్చించారు. సమావేశంలో కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం - ములగలంపల్లి రహదారి నిర్మించాలి

జంగారెడ్డిగూడెం: పట్టణం నుంచి జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి రహదారి నిర్మాణంపై చర్చించారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం రోడ్డును తవ్వేసి వదిలేశారన్నారు. ఎమ్మెల్యే స్పందించి త్వరలో రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు శేషు తెలిపారు.

టీచర్ల పని సర్దుబాటులో అసంబద్ధత తొలగించాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 27: సర్‌ప్లస్ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధతలను తొలగించాలని డీఈవో అబ్రహంకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు, అర్హతలు లేని ఎస్జీటీలను హైస్కూళ్లకు సబ్జెక్టు టీచర్లుగా ఎలా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. ఉన్నత పాఠశాలల్లో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లను కూడా సర్‌ప్లస్ ఉపాధ్యాయులుగా గుర్తించడం సరికాదన్నారు. ఖాళీగావున్న హైస్కూల్ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌పోస్టులను ప్రమోషన్లద్వారా భర్తీచేయాలని డిమాండ్ చేశారు. డీఈవోను కలిసిన సంఘ నాయకుల్లో రమణ, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 27: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఐటీఐ డీఎల్‌టీసీ ప్రిన్సిపాల్ రవి మంగళవారం తెలిపారు. ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో మూడు నెలల శిక్షణ ఉంటుందని, ఇంటర్, ఆపైన విద్యార్హత, 15 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 3వరకు గడువు ఉందని, వివరాలకు ఫోన్ నెంబరు 94934 82414లో సంప్రదించాలని కోరారు.

చెరువుల ఆక్రమణపై విచారణ జరపాలి

చింతలపూడి, ఆగస్టు 27: యర్రగుంటపల్లిలో సాగునీటి చెరువుల ఆక్రమణపై విచారణ జరపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడపర్తి ముత్తారెడ్డి మంగళవారం కోరారు. మైనర్ ఇరిగేషన్‌కు చెందిన ముత్యాలమ్మ చెరువును పూర్తిగా ఆక్రమించి సాగుచేస్తున్నారని, దిగువ ఆయకట్టుదారులు గొట్టపు బావులు వేసుకుని సేద్యం చేస్తున్నారని చెప్పారు. గ్రామంలో సాయమ్మ చెరువు, కొండ సముద్రం చెరువు ఆక్రమణలో ఉన్నాయని, విచారణకు గ్రామసభల్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్ మార్పు చేయాలి

చింతలపూడి, ఆగస్టు 27: పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షల షెడ్యూల్ మార్చాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శులు డి.రాజబాబు, ఎ.రాము కోరారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 4 వరకు పరీక్షలు జరపడం సమయం వృధా అని, గతంలో మాదిరి రోజుకు రెండు పరీక్షలు జరపాలన్నారు. ప్రతిరోజూ పరీక్ష పేపర్లను ఒక గంట ముందే తెచ్చుకుని పరీక్ష నిర్వహించాలనే నిర్ణయం సరైనది కాదన్నారు. మండల కేంద్రం నుంచి పాఠశాలలు, 20 కిలోమీటర్ల దూరం వరకు ఉన్నాయని గుర్తు చేశారు. స్కూల్ కాంప్లెక్స్‌ల ద్వారా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వెబ్‌ల్యాండ్ ఓపెన్ చేయాలి

కుక్కునూరు, ఆగస్టు 27: భూములకు సంబంధించిన వెబ్‌ల్యాండ్‌ను ఓపెన్ చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలు సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. మంచినీటి సమస్య, ఉపాధి హామీ పనులపై పనుల గురించి చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరాస్వామి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. కె.కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.కృష్ణ, దానభాస్కర్, నగరపాటి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగసురేష్, గాదే రాంబాబు, నాగం శివ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలో బీజేపీ సభ్యత్వాలను విరివిగా నమోదు చేయాలన్నారు. ప్రతీ బీజేపీ కార్యకర్త తమ మొబైల్ ఫోన్ నుండి 8800002024 నెంబరుకు మిస్డ్ కాల్ చేయడం ద్వారా సాధారణ సభ్యత్వం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మానేపల్లి రామారావు, టి.బ్రహ్మాజీ, కొనకళ్ళ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 27: వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మీటర్లు బిగించేందుకు జీవో నెంబర్ 22 విడుదల చేసిందని గుర్తు చేశారు. మీటర్ల బిగింపును నాడు వ్యతిరేకించిన టీడీపీ నేడు ఆ జీవో రద్దు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కట్టా భాస్కరరావు, సిరిబత్తుల సీతారామయ్య, నున్నా వెంకట్రావు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల ఆదేశాలు నిలుపుదల చేయాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 27: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, ఎల్‌టీఆర్, పిసా చట్టాలకు విరుద్ధంగా ల్యాండ్ కన్వర్షన్ పేరుతో ఆర్డీవో ఆర్డర్లను వెంటనే నిలుపుదల చేయాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ పేరుతో ఆర్డీవో నుంచి అనుమతులు తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణమే ఆపాలన్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనకు దిగుతామన్నారు. ఏజెన్సీలో ల్యాండ్ కన్వర్షన్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

1న అపుస్మా సమావేశం


ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని సెప్టెంబరు 1న చింతలపూడిలో నిర్వహించనున్నారు. మంగళవారం 'అపుస్మా' రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంబీఎస్.శర్మ నాయకత్వంలోని సంఘ ఏలూరుజోన్ నాయకులు డీఈవో అబ్రహంను కలుసుకుని మీటింగ్‌కు రావాలని కోరారు.

జ్వర బాధితులు వైద్యులను సంప్రదించాలి

లింగపాలెం, ఆగస్టు 27: జ్వర బాధితులు వైద్యులను సంప్రదించాలని కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. బాదరాలలో మంగళవారం ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరం, తలనొప్పిని నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కామవరపుకోట బీఎల్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ ఎలీషా



పెదపాడు బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో తేజరతన్

18 వరకు ఓటర్ల జాబితా సవరణ

కామవరపుకోట, ఆగస్టు 27: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందని తహసీల్దార్ గెడ్డం ఎలీషా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బీఎల్వోలు, వీఆర్వోలు, వీఆర్‌ఏలతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్వోలు తమ పరిధిలోని గృహాలను సందర్శించి పూర్తిస్థాయి వివరాలు సేకరించాలన్నారు. ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులు, తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలు, ఇక్కడి నుండి వెళ్ళిన వారి వివరాలు తెలపాలన్నారు. ఇదే క్రమంలో మృతి చెందిన ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. ఎంపీడీవో కె.శ్రీదేవి, ఆర్ఐ విజయసారధి పాల్గొన్నారు.

● పెదపాడు: ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. తహసీల్దారు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బీఎల్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో తేజరతన్ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో పోలింగ్ బూత్‌లను పూర్తిస్థాయిలో పునఃపరిశీలన చేసి, తగిన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఓటర్ల అస్పష్ట ఫొటోల ముద్రణకు చర్యలు, పోలింగ్ బూత్ పరిధిలో జాబితాలు గుర్తింపు, అభ్యంతరాలు స్వీకరణపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అర్హులైన వారంతా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని ఆర్డీవో ఖాజావలి కోరారు. ఏప్రిల్ 25న ప్రచురించిన తుది ఓటర్ల జాబితాపై తేడాలు ఉంటే పరిశీలించుకోవాలన్నారు. సెప్టెంబరు 18 వరకు ఇంటింటి సర్వే జరిపి ఓటర్ల జాబితాను నూతనంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. బీఎల్వోలు ఇంటింటి సర్వే జయప్రదం చేయడంతో పాటు సహకరించాలన్నారు.



చేబ్రోలు నుంచి మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

హత్యాచార సంఘటనపై మహిళల నిరసన

ఉంగుటూరు, ఆగస్టు 27: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటనపై నిరసనగా మంగళవారం మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు నుంచి నారాయణపురం సర్కిల్ వరకు కొనసాగిన ర్యాలీలో మహిళా ప్రజా ప్రతినిధులు, టీడీపీ ప్రజా ప్రతినిధులు, మహిళా పోలీసులు ఉన్నారు. చేబ్రోలు, నారాయణపురం, సీతారాంపురం గ్రామాల సర్పంచ్‌లు రాందే లక్ష్మీ సునీత, దిడ్ల అలకనంద, బళ్ళ రాధ, అడపా శోభారాణి, తెలుగు మహిళ నాయకులు ఉన్నమట్ల సునీత, యెగ్గిన శ్యామల, బొడ్డు శాంత కుమారి, గంటా ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు నుంచి మద్ది క్షేత్రానికి పాదయాత్ర



గుర్వాయిగూడెంలో నరేంద్రరాజు, నాయకులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 27: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే కాలి నడకన గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వస్తానని కుక్కునూరుకు చెందిన వేగేశ్న నరేంద్ర రాజు మొక్కుకున్నారు. ఆదివారం కుకునూరు నుంచి కాలినడకన 71 కిలోమీటర్లు నడిచి మంగళవారం ఉదయానికి మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. నరేంద్ర రాజు గుర్వాయిగూడెం చేరుకోగానే ఆయనతో పాటు టీడీపీ మండల నాయకులు కుక్కల మాధవరావు, బూసా సత్యనారాయణ రెడ్డి, ఉండవల్లి చంద్రరావు, తదితరులు మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు.

మద్యం మత్తులో పాత స్నేహితుల దాడి

దెందులూరు, ఆగస్టు 27: మద్యం మత్తులో పాత స్నేహితులు దాడి చేసుకున్నారు. దెందులూరు గ్రామానికి చెందిన స్నేహితులు అరవింద్, సీహెచ్ ఆకాష్, బక్కిన మహేశ్ కొంతకాలంగా మాట్లాడుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం దెందులూరు నాలుగురోడ్ల కూడలి వద్ద వారు ముగ్గురి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న అరవింద్ చాకుతో మహేష్, ఆకాష్‌పై దాడి చేశాడు. గాయపడిన వారిని స్థానికులు దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్లిన బాలిక అదృశ్యం

పెదపాడు, ఆగస్టు 27: ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదుతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వేంపాడు గ్రామానికి చెందిన బాలిక 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో రెండు ఇసుక లారీలు

కుక్కునూరు, ఆగస్టు 27: ఇబ్రహీంపేట రీచ్‌లో కొనుగోలు చేసిన ఇసుకను ఆంధ్రా ప్రాంతానికే రవాణా చేసుకోవాలి. సోమవారం తెలంగాణలోని అశ్వారావు పేటలో రెండు లారీల ఇసుకను దిగుమతి చేసినట్లు కుక్కునూరు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం ఇసుకను కొనుగోలు చేసి తీసుకెళుతున్న రెండు లారీలను గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

లారీని ఢీకొన్న బైక్ : యువకుడికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 27: రోడ్డుపై ఆగిఉన్న లారీని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వట్లూరు సమీపంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బూసి రాంప్రసాద్ (28) మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై మినీ బైపాస్ రోడ్‌లో వెళుతున్నాడు. గ్రీన్ సిటీ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని త్రీ టౌన్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అర్ధరాత్రి విజయవాడ తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే చంటి పుస్తకాలు, సైకిళ్ళు పంపిణీ చేశారు. పీవీజే.తిలక్, బొరోతు బాలాజీ, రాజు, పాఠశాల సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.
- మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మోహద్దీన్, దుర్గారావు, శ్రీనివాస్, మహేష్, కిరణ్, గౌతమ్ పాల్గొన్నారు.
- ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 18 ఏళ్ళు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో పేరు, అడ్రస్, ఫోటోమార్పు బీఎల్వో ద్వారా సరి చేయించుకోవాలన్నారు.
- **కామవరపుకోట :** గ్రామాల్లో ఈనెల 30న మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈవోఆర్‌డి మరిడయ్య గ్రామ కార్యదర్శులు జీడీవీ.శ్రీనివాసరావు, నేతల విజయ్, వి.రాజేష్, వై.వి.అప్పారావు, జె.సుబ్బారావు పాల్గొన్నారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దాత మాదల బాబురావు జ్ఞాపకార్థం సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించినట్లు ఈవో చెప్పారు.
- **ఉంగుటూరు :** కైకరం హైస్కూలులో 130 మంది విద్యార్థులకు దాత ముత్తంగి వేణుగోపాలకృష్ణ ప్రసాద్ బస్ పాస్‌లు పంపిణీ చేశారు. ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు, విద్యా కమిటీ ఛైర్మెన్ అల్లూరి జగదీశ్వరి పాల్గొన్నారు.
- **లింగపాలెం :** ఈ-పంట త్వరగా నమోదు చేయాలని, కౌలు రైతులకు కార్డులను రైతలకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు మహమ్మద్ నజీముల్లాషా సూచించారు. కౌలు రైతుల కార్డుల జారీపై వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. పంట నమోదు,కౌలు రైతులకు ఇచ్చే కార్డుల వల్ల లాభాలను రైతులకు వివరించారు..

భౌబోయ్..



చాట్రాయి వీధుల్లో సంచరిస్తున్న కుక్కల మంద

- ప్రజలపై దాడులు
- జీవాలను చంపేస్తున్నాయ్
- కుక్కల స్వైర విహారంతో వణికిపోతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో గ్రామస్థుల వినతి



చాట్రాయిలో కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు (ఫైల్)

చాట్రాయి, ఆగస్టు 27: మండలంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి రేయింబవళ్ళు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రతి వీధిలోను, వ్యవసాయ భూముల్లో కుక్కలు మందగా సంచరిస్తూ మునుషులు, పశువులు, మేకలు, గొర్రెలపై దాడులకు తెగబడుతున్నాయి. రాత్రి సమయాల్లో కుక్కల మంద వీధుల్లో తిష్ఠ వేసి దారిన వెళ్ళే ద్విచక్రవాహనదారుల వెంట పడుతుండటంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. కోళ్ళ ఫారాలు, చికెన్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థాలను గ్రామ శివార్లలో పారబోస్తుండటంతో వాటిని తిని కుక్కలు బలిష్ఠంగా తయారై దాడులకు తెగబడుతున్నాయి. మేకలు, గొర్రెల దొడ్లపై దాడులు చేసి పదుల సంఖ్యలో జీవాలను చంపివేస్తుండటంతో వాటి పోషకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇటీవల కుక్కలు పశువుల దొడ్లపై కూడా దాడిచేసి దూడల శరీర భాగాలు తిని వేస్తున్నాయి. కుక్కలు ఎప్పుడు వచ్చి దాడి చేస్తాయోనని పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కంటి మీద కునుకు లేకుండా కాపలా కాస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

4వ తేదీ నుంచి అండర్-19 జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, ఆగస్టు 27 : వచ్చేనెల నాల్గవ తేదీ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తామని అండర్19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు.అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వచ్చే డిసెంబరు నెల 31వ తేదీనాటికి 19 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, ప్రతిభ ఆధారంగా జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని వివరించారు. వచ్చేనెల సెప్టెంబరు 4వ తేదీన పెదవేగి గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు, 6వ తేదీన బాలురకు సంబంధించి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బాడ్మింటన్, హేండ్ బాల్, 10వ తేదీన బాల, బాలికలకు త్రోబాల్, టెన్నీకాయిట్, చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 13వ తేదీన బాలికలకు సంబంధించి ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో బాస్కెట్ బాల్, హేండ్‌బాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 17వ తేదీన బాల, బాలికలకు సంబంధించి ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, జూడో, కరాటే, స్కేటింగ్, 18వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాల, బాలికలకు ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. 19వ తేదీన తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బాలికలకు సంబంధించి టేబుల్ టెన్నిస్, చెస్, బాడ్మింటన్ వాలీబాల్, ఖోఖో, యోగా పోటీలు ఉంటాయని వివరించారు. 20వ తేదీన ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్ బాలురకు, క్రికెట్ బాల, బాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. 21వ తేదీన భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు ఆర్చరీ, షూటింగ్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, నెట్‌బాల్, జిమ్నాస్టిక్ పోటీలు జరుగుతాయని, అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ఆయా చోట్ల జరిగే పోటీలకు హాజరుకావాలని సూచించారు.

1న అపుస్మా సమావేశం

ఏలూరు అర్బన్, ఆగస్టు 27 : ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని సెప్టెంబరు 1న చింతలపూడిలో నిర్వహించనున్నారు. మంగళవారం 'అపుస్మా' రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎంటీఎస్.శర్మ నాయకత్వంలోని సంఘ ఏలూరుజోన్ నాయకులు డీఈవో అబ్రహంను కలుసుకుని మీటింగ్‌కు రావాలని కోరారు.

పోయిన నగలు దొరికాయి..



ద్వారకాతిరుమల, ఆగస్టు 27: ద్వారకాతిరుమల పెళ్లికి వచ్చి అక్కడి మండపంలో నగలు పోగొట్టుకున్న వారికి ఆలయ అధికారులు ఆ నగలను తిరిగి అప్పగించారు. ద్వారకా తిరుమల ధర్మఅప్పారావు నిలయంలో ఈనెల 23న పెళ్లి జరిగింది. గుంటూరుకు చెందిన పేరం నాగేశ్వరరావు కుటుంబం తమ బంగారు నగలను గదిలో మర్చిపోయి వెళ్లిపోయారు. వజ్రపు ఉంగరం, గాజు, నల్లపూసల గొలుసు, దుద్దులు కనిపించక పోవడంతో అంతా వెదికి చివరకు దేవస్థానం అధికారుల తెలిపారు. అయితే ఈ నగలను గుర్తించిన అక్కడి సిబ్బంది వాటిని ఆలయ అధికారులకు అప్పగించారు. అధికారులు ఈ విషయాన్ని ఫోన్‌లో యజమానికి తెలియపర్చగా పోయిన వస్తువుల వివరాలు చెప్పారు. ఇక్కడకు వచ్చే వీలు లేకపోవడంతో స్థానికంగా ఉన్న వారి బంధువులకు ఈ నగలను అప్పగించారు.

క్రీడా దుస్తుల వితరణ



మండవల్లి, ఆగస్టు 27 : చిన్ననాటి నుంచే విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని లోకుమూడి గణపతి దత్తాశ్రమం ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయశంకర్ అన్నారు. లోకుమూడి జడ్పీ హైస్కూలులో మంగళవారం గురజాడ ఉదయ శంకర్, తలారి వెంకట రామారావు, కరేటి శివకృష్ణ ఆర్థిక సాయంతో విద్యార్థుల కు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు తలారి రాజేష్, బూత్ కన్వీనర్ విజయకుమార్, హెచ్ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్ బహూకరణ



కైకలూరు, ఆగస్టు 27: పాఠశాలకు పూర్వ విద్యార్థులు మంచినీటి కూలర్‌ను అందజేశారు. మంగళవారం వేమవరప్పాడు ఎంపీ యూపీ స్కూల్ పూర్వ విద్యార్థులు జాజుల బాలాజీ, బోడావుల మల్లేశ్వరరావు, బోడావుల వీరబాబు, మువ్వల సురేష్ విరాళాలతో వాటర్ కూలర్‌ను స్కూల్ హెచ్ఎం చిట్టూరి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు వసతుల కల్పనలో భాగంగా పూర్వ విద్యార్థులు కూలర్‌ను అందజేయడం అభినందనీయమన్నారు.

వైద్యులకు రక్షణ కల్పిస్తాం : మంత్రి సారథి



ఐఎంఏ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సారథి

నూజివీడు/ఆగిరిపల్లి, ఆగస్టు 27: నర్సింగ్ హోంలలో 24 గంటలు ప్రజలకు వైద్య సదుపాయం అందేలా వైద్యులు చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం రాత్రి నూజివీడులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి సారథికి సన్మానం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమపై దాడులు జరుగుతున్నాయన్న భయంతో వైద్యులు సేవలందించడంలో వెనుకడుగు వేయటం సరికాదన్నారు. వైద్యులు ఎలాంటి భయాందోళనలు లేకుండా వారి విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికిరణ్, వైద్యులు డాక్టర్ వి. రాఘవరావు, డాక్టర్ విజయ్, డాక్టర్ హనుమంతరావు చౌదరి, డాక్టర్ బొబ్బిలి ఝాన్సీరాణి, డాక్టర్ తాతయ్య బాబు, డాక్టర్ శైలజ, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మండవ శిరీష తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలతో బలహీనపరచలేరు..

తన వెనుక ప్రజలు ఉన్నంత వరకు తప్పుడు ప్రచారాలతో తనను బలహీనపరచలేరని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి నూజివీడు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తనపై దుష్ప్రచారం చేశారు.. ఇప్పుడు చేస్తున్నారు. అప్పుడు పట్టించుకోలేదు, ఇప్పుడు పట్టించుకోనన్నారు. నూజివీడులో అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటుకు అవసరమైన ప్లానింగ్ కోసం నిపుణుడిని నియమిస్తున్నామన్నారు. అలాగే నూజివీడులో మామిడి మార్కెట్ రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించటానికి టెండర్లు పిలిచామన్నారు. పోలవరం కాలువ నుంచి నూజివీడు మండలం మీర్జాపురం పెద్ద చెరువుకు గోదావరి నీరు తీసుకువచ్చి నూజివీడు మండలానికి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. తమ్మిలేరు ప్రాజెక్టు నుండి చాట్రాయి మండలానికి తాగునీరు అందించటానికి అంచనాలు సిద్ధమయ్యాయని తెలిపారు. గతంలో సుదీర్ఘకాలం శాసనసభ్యుడిగా పనిచేసిన స్థానికుడు ఈ నియోజకవర్గానికి చేసింది శూన్యమని ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలు గుర్తించాలన్నారు. ఆగిరిపల్లి మండలం, శోభనాపురం గ్రామంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. గ్రామంలో స్థల సేకరణ చేస్తే వెంటనే శ్రీకృష్ణుని గుడి కట్టించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.



వేంపాడు మేజర్‌కు నీటి విడుదల పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వేంపాడు మేజర్‌కు సాగర్ జలాల విడుదల

చాట్రాయి, ఆగస్టు 27: మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో మంగళవారం నాగార్జున సాగర్ వేంపాడు మేజర్ కాలువకు అధికారులు నీరు విడుదల చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, పార్టీ మండల నాయకులు పలగాని దుర్గారావు, మరిడి చిట్టిబాబు, కలకొండ భాస్కరరావు తదితరులు రైతులతో కలసి ఇటీవల మంత్రిని కలసి చాట్రాయి, ముసునూరు మండలాల్లో చెరువుల్లో నీరు లేక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని వేంపాడు మేజర్‌కు సాగర్ జలాలు విడుదల చేసి చెరువులు నింపాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి ఎన్నెస్పీ ఎస్ఈకి ఫోన్ చేసి ఆదేశాలు ఇవ్వటంతో నీరు విడుదలైయింది. అయితే వేంపాడు కాలువకు తగినంత నీరు విడుదల చేయకపోవటంతో బసవారెడ్డి ఎన్నెస్పీ ఎస్ఈ శివరామకృష్ణకు ఫోన్ చేసి నీటి విడుదల పెంచాలని కోరగా బుధవారం నుంచి 300 క్యూసెక్కులకు పెంచి చెరువులు నింపుతామని ఎస్ఈ హామీ ఇచ్చారు.

పని దినాల్లోనే పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

ముదినేపల్లి, ఆగస్టు 27 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియలో ఉద్యోగులు యథాస్థితిని కొనసాగిస్తున్నారు. కంప్యూటరీకరణలో పీఏసీఎస్‌ల సీఈవోలు, ఇతర ఉద్యోగులపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగటం, సెలవు దినాల్లో కూడా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేసినందుకు నిరసనగా ఉద్యోగులు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వర్క్ టూ రూల్ పాటించాలని నిర్ణయించారు. సెలవు దినాలైన ఈ నెల 24, 25, 26 తేదీల్లో కంప్యూటరీకరణను ఉద్యోగులు బహిష్కరించారు. తిరిగి మంగళవారం ముదినేపల్లి సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని అన్ని పీఏసీఎస్‌ల ఉద్యోగులు రికార్డుల కంప్యూటరీకరణ పనులు చేపట్టారు. దీంతో పని దినాల్లో మాత్రమే ఈ పనులు నిర్వహించేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు. కంప్యూటరీకరణపై చర్చించేందుకు బుధవారం సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో సమావేశం కానున్నట్లు ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ తెలిపారు.

కొల్లేరును పరిరక్షించాలి



ఐక్యవేదిక కన్వీనర్ భాస్కరరావు

మండవల్లి, ఆగస్టు 27: సహజ సిద్ధమైన కొల్లేరు సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించి సరస్సు, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కొల్లేరు సరస్సు నానాటికి ఆక్రమణలతో కుంచించుకుపోతూ, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. చిత్తడి నేలల కొల్లేరు పరిరక్షణకు ఎన్నో చట్టాలు, కమిటీలు, తగినంత సిబ్బంది ఉన్నప్పటికీ ఆక్రమణలకు గురవటం, నిబంధనలకు వ్యతిరేకంగా సరస్సులో ఆక్వా సాగు జరగటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు సరస్సులో రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టి, పర్యాటకంగా అభివృద్ధి చేయటంతో పాటు సరస్సు పర్యావరణాన్ని కాపాడి ప్రజలను ఆరోగ్యంగా ఉంచేలా కృషి చేయాలని కోరారు.

మానవత అధ్యక్షుడు కొండ్రెడ్డికి అవార్డు



కైకలూరు, ఆగస్టు 27: కైకలూరు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఆ సంస్థ అధ్యక్షుడిగా సేవలందించిన కొండ్రెడ్డి సత్యనారాయణ మదర్ థెరిసా సర్వీసెస్ అవార్డును అందుకున్నారు. థెరిసా జయంతిని పురస్కరించుకొని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎక్స్‌రే లిటరరీ కల్చరల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జడ్పీ మాజీ ఛైర్మన్ గద్దె అనూరాధ, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి తదితరులు సత్యనారాయణను ఘనంగా సత్కరించి అవార్డును అందజేశారు. ఈ అవార్డు రావడం పట్ల కైకలూరు ప్రజలు, మానవత సభ్యులు ఆయనను అభినందించారు.



రూ. 25 కోట్లతో రహదారి అభివృద్ధి

నూజివీడు టౌన్, ఆగస్టు 27: గత ఐదేళ్లలో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. నియోజకవర్గ టీడీపీ నాయకుడు ఆట్లూరి రమేష్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నూజివీడు - గన్నవరం నియోజకవర్గాలను కలిపే పల్లెర్లమూడి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరడంతో 2022 డిసెంబర్‌లో గన్నవరం నియోజకవర్గం వేలేరు నుంచి పల్లెర్లమూడి మీదుగా బొమ్ములూరు వరకు 15 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ. 25 కోట్లను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిధులు మంజూరైనా రహదారి నిర్మాణం జరగకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి ఈ పనుల్ని వేగవంతం చేయించడంతో రెండు నెలల కాలంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. త్వరలో మంత్రి పార్థసారథి రహదారి ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టనున్నారు. బాపులపాడు మండలం వేలేరు నుంచి ప్రారంభమయ్యే రహదారి అభివృద్ధిలో పల్లెర్లమూడిలో ఒక కిలో మీటరు, సీతారామపురంలో 200 మీటర్లు, వేలేరులో 600 మీటర్లు, కొయ్యూరులో 205 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం రిటైనింగ్ వాల్‌తో పాటు మిగిలిన రోడ్డు తారు రోడ్డుతో అభివృద్ధి చేస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆట్లూరి రమేష్ తెలిపారు. నిర్మాణంలో ఉన్న రహదారిని గ్రామస్థులు దావులూరి కృష్ణమోహన్, యనమదల సిద్ధయ్య, కనిగంటి రుష్యారావు, యనమదల వాసు, బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణాష్టమి ఊరేగింపులో పోలీసుల ఆంక్షలు

ముదినేపల్లి, ఆగస్టు 27 : వైవాకలో మంగళవారం నిర్వహిస్తున్న శ్రీ కృష్ణుడి ఊరేగింపు కార్యక్రమానికి పోలీసులు ఆంక్షలు విధించారు. ఊరేగింపునకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఉదయమే వైవాక చేరుకున్నారు. ఊరేగింపులో డీజే సౌండ్ వినియోగించవద్దని ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది నిర్వాహకులకు తెలిపారు. దీనిపై నిర్వాహకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు డిజె సౌండ్స్ లేకుండానే శ్రీ కృష్ణుడి ఊరేగింపును నిర్వాహకులు ప్రశాంతంగా నిర్వహించారు.

నూజివీడు రూరల్ ఎస్సైగా లక్ష్మణబాబు



నూజివీడు టౌన్, ఆగస్టు 27: నూజివీడు రూరల్ ఎస్సైగా ఎన్.లక్ష్మణబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మల్లికార్జున రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో ఏలూరు పట్టణ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన లక్ష్మణబాబు రూరల్ ఎస్సైగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

చనుబండ పంచాయతీ కార్యదర్శిగా శివనాగరాజు



చాట్రాయి, ఆగస్టు 27: మండలంలోని చనుబండ పంచాయతీ కార్యదర్శిగా శివనాగరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తుమ్మగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఆయన ప్రమోషన్‌పై చనుబండకు బదిలీ అయ్యారు. శివనాగరాజు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అటవీ, బంజరు భూములకు పట్టాలివ్వాలి

నూజివీడు, ఆగస్టు 27: గత 50 ఏళ్ళ నుంచి అటవీ, బంజరు భూముల్లో సాగులో ఉన్న పేద, బలహీన వర్గాలకు పట్టాలివ్వాలని సీపీఐ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు అటవీ అధికారులకు విజ్ఞాపన పత్రం అందజేశారు. మంగళవారం నూజివీడు అమర్‌భవన్‌లో లబ్ధిదారులతో వీరు సమావేశమయ్యారు. మూడు తరాలు సాగులో ఉన్న భూములకు మాత్రమే పట్టాలివ్వాలనే చట్టాన్ని సవరించాలన్నారు. అనంతరం వీరు ప్రదర్శనగా నూజివీడు అటవీ శాఖ కార్యాలయానికి వెళ్ళి అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, సాగుదారులు అబ్బూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

4 గ్రామాల్లో వైద్యశిబిరాలు



ముసునూరు, ఆగస్టు 27: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కొర్లకుంట, ముసునూరు, కాట్రేనిపాడు, చింతలవల్లి గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 150 మందికి వైద్యపరీక్షలు చేయగా, ఏడుగురుకి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. జ్వర పీడితులకు టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చినట్లు హెల్త్ సూపర్‌వైజర్ మురళీమోహన్ తెలిపారు.

కాట్రేనిపాడులో సమస్యల పరిష్కారానికి చర్యలు

ముసునూరు, ఆగస్టు 27: కాట్రేనిపాడు పంచాయతీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్ రావు అన్నారు. మంగళవారం సచివాలయానికి వెళ్ళే రహదారితోపాటు ఎస్సీ, బీసీ కాలనీల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీల్లో పూడికతీత మట్టిని గ్రామ శివారుల్లోకి తరలించారు. అలాగే డ్రైనేజీలు లేని చోట పునరుద్ధరించారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన ఆర్థిక సంఘాల నిధులను సైతం పక్కదారి పట్టించడం వల్ల ముందుగా సొంత నగదును వెచ్చించి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశామన్నారు. నూతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయితీల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, నిధుల కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు.

పంచాయతీలకు జనరల్ ఫండ్స్ బకాయిలివ్వాలి

చాట్రాయి, ఆగస్టు 27: పంచాయతీలకు జనరల్ ఫండ్స్ బకాయిలు విడుదల చెయ్యాలని చిన్నంపేట, జనార్దనవరం సర్పంచ్‌లు పరసా ధనలక్ష్మి, పామర్తి ఝాన్సీరాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 3 ఏళ్ళ నుండి జనరల్ ఫండ్స్ విడుదల చేయకపోవటంతో గ్రామాల్లో పనులు చెయ్యలేకపోతున్నామన్నారు. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో పారిశుధ్య పనులకు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఎన్టీఆర్ జిల్లాలో కొన్ని మండలాలలో గ్రామ పంచాయతీలకు జనరల్ ఫండ్స్ విడుదల చేశారని ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీలకు జనరల్ ఫండ్స్ విడుదల చెయ్యాలని కోరారు.

బి-ఫార్మసీ కళాశాల మంజూరు

ముదినేపల్లి, ఆగస్టు 27 : ముదినేపల్లికి బి-ఫార్మసీ కళాశాల మంజూరైంది. 2024-25 వైద్య విద్యాసంవత్సరం నుంచి స్థానిక వీఆర్‌సి గౌతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కళాశాలను ప్రారంభించేందుకు ఆల్ ఇండియా ఫార్మసీ కౌన్సిల్ అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ జేఎన్‌టీయూకు అనుబంధంగా ఈ కళాశాలను నిర్వహిస్తారు. ఈ కళాశాలకు వంద సీట్లను మంజూరు చేయగా, 70 సీట్లు కౌన్సెలింగ్ ద్వారా, 30 సీట్లు మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేస్తారు. ఈ సొసైటీ ఇప్పటికే పాలిటెక్నిక్, బీఈడీ డీఈడీ కళాశాలను నిర్వహిస్తుండటం, భవనాలు, ఇతర సౌకర్యాలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి సిఫార్సు మేరకు ఫార్మసీ కౌన్సిల్ ముదినేపల్లిలో బి-ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన ఈ ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు ఈ ఏడాది అక్టోబరులో కౌన్సిలింగ్ నిర్వహిస్తారని ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కొత్తూరు వేణు తెలిపారు.



మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు

రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదుచేయాలి

కైకలూరు, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వాలను రికార్డు స్థాయిలో నమోదు చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు పిలుపునిచ్చారు. మంగళవారం కైకలూరులో పార్టీ మండల అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు అధ్యక్షతన సభ్యత్వాల నమోదుపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి జాతీయ స్థాయిలో పార్టీ సభ్యత్వాల నమోదు ప్రారంభిస్తున్నారని, కైకలూరు నియోజకవర్గంలో గతంలో 77 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశామని ఇప్పుడు కూడా నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సభ్యత్వాల నమోదు జరుగుతుందన్నారు. సభ్యత్వాల నమోదు కోసం 88000 02024 ఫోన్ నెంబరు ద్వారా మిస్డ్‌కాల్, క్యూ ఆర్‌కోడ్ విధానం, నమో యాప్, ఫాం ద్వారా సభ్యత్వాలు నమోదు చేసుకోవచ్చు న్నారు. సభ్యత్వ నమోద్ ప్రముఖ్ వేంపాటి గోవింద చంద్రశేఖర్, సహాయ ప్రముఖ్ బోయిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజగోపాలుడి కల్యాణం



నూజివీడు, ఆగస్టు 27: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నూజివీడులో జన్మాష్టమి రెండో రోజును పురస్కరించుకొని మంగళవారం శ్రీ కృష్ణుడికి నిత్య పూజా కార్యక్రమం అనంతరం ఊరు వెలిగింపు (ఊరేగింపు) కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గీతా పారాయణంతో అప్సరా థియేటర్ నుంచి నూజివీడు పుర వీధుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు పట్టణ కమిటీ అధ్యక్షుడు నాయుడు, సభ్యులు అంజిబాబు, రవి, జీవన్, లైలా తదితరులు పాల్గొన్నారు. ప్రసిద్ధ నూజివీడు రాజగోపాలస్వామి కల్యాణ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు రాఘవకుమార్ ఆధ్వర్యంలో జరిగిన రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామికి శాంతి కల్యాణం వీక్షించేందుకు భక్తులు విశేషంగా హాజరయ్యారు.

1 నుంచి శ్రీశ్యామలాంబ మాలధారణ



కైకలూరు ఆగస్టు 27: శ్రీశ్యామలాంబ అమ్మవారి మాలధారణ దీక్ష వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆలయ ఈవో శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి మండల దీక్ష సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 12 వరకు, అర్థ మండల దీక్ష సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 12 వరకు, నవదిన దీక్ష అక్టోబరు 1 నుంచి 12వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ మాలధారణ భక్తులకు ఉచితంగా అమ్మవారి రాగి ప్రతిమ అందజేస్తామని ఆయా తేదీల్లో దీక్షలు చేపట్టేవారు ఆలయ కార్యాలయంలో పేరు, గోత్రం, చిరునామా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 98668 99304లో సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మికం

వెండి మకర తోరణం బహూకరణ



ముసునూరు, ఆగస్టు 27: గోపవరంలోని సుబ్రహ్మణేశ్వర స్వామివారికి డాక్టర్ యుగేందర్ కుటుంబీకులు మంగళవారం వెండి మకర తోరణాన్ని సమర్పించారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు గార్లపాటి యుగేందర్ దంపతులు, కుమారుడు డాక్టర్ సతీష్ దంపతులు వెండి మకర తోరణాన్ని స్వామివారికి సమర్పించారు. ఆలయ అర్చకులు చిట్టిబాబు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలకరించారు. ఆలయ నిర్వాహకులు నందిగం సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాధివాసం



ముదినేపల్లి, ఆగస్టు 27 : మండలం లోని అల్లూరులో నిర్మించిన శ్రీ కృష్ణ మందిర ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలలో హోమాలు, స్వామివార్లకు విశేష పూజలు నిర్వ హించారు. విఘ్నేశ్వరుడు, శ్రీకృష్ణుడు, సత్యనారాయణ స్వామి విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, శాంతి కుంభ స్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శీలం వెంకటేశ్వరరావు, బోయిన హరికృష్ణ ఆధ్వర్యంలో యాజ్ఞికుడు సోమరాజుపల్లి ఈశ్వర నాగకుమార శర్మ ఇతర అర్చకులు హోమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు యాగశాలలో పూజలు జరిపారు. ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని బావాజీ మఠంలో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని సాంప్రదాయ ప్రకారం వట్టి వేళ్లతో అలంకరించి అర్చకుడు రంగనాథాచార్యులు అభిషేకం నిర్వహించారు. వడాలిలో జగన్నాథస్వామి ఆలయంలో ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

రెండోరోజు కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం కూడా మండలంలో వైభవంగా నిర్వహించారు. సింగరాయపాలెంలోని బావాజీ మఠం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో యాదవ యూత్ కార్యకర్తలు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో భవిత కేంద్రంలో హెచ్ఎం విజయ కుమార్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగ పిల్లలు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ముదినేపల్లిలోని పెదరామాలయంలోను కృష్ణాష్టమి వేడుకలు కమిటీ సభ్యులు అడుసుమిల్లి రాజేంద్ర ప్రసాద్, దాయినేని కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు.